సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

అటో ఆటో.. ఇటో ఆటో.. మధ్యన గొయ్యి

- ఆటో ఖర్ఖానాగా నేరెళ్లకోనేరు రోడ్డు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



రోడ్డుకు ఇరువైపులా ఆటోలతో ఇరుగ్గా మారిన హరిత లాడ్జి రోడ్డు



పక్కనే పాదచారులు నడుస్తున్నా స్ప్రే పెయింటింగ్ పని ఆపకుండా చేస్తున్న దృశ్యం (సర్కిల్‌లో)

అల్లిపురం: జీవీఎంసీ 32వ వార్డులో నేరెళ్లకోనేరు వినాయక దేవాలయం నుంచి హరిత లాడ్జి వరకు పాదచారులు రాకపోకలు సాగించేందుకు దారి కరువయింది. ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి అయితే చెప్పనలవికాదు. అలాగే కాలనీ నివాసుల పరిస్థితి కూడా అధ్వానమని చెప్పాలి. రోడ్డు మధ్యలో రెండు నెలల క్రితం భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. అయితే పనులు సక్రమంగా పూర్తి కాకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వాటిలో పడి వాహన చోదకులతో పాటు పాదచారులు తీవ్రంగా గాయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా వాటిని పూడ్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా రోడ్డు తవ్వి పాదచారులు నడవడానికి వీల్లేకుండా ఉన్న పరిస్థితుల్లో ఆటో టింకరింగ్, పెయింటింగ్ పనులు, మరమ్మతులు చేస్తూ మరింత ఇరుగ్గా మార్చేస్తున్నారు. దారికి అడ్డంగా ఆటోలు పెట్టి మెకానిక్‌లు రోడ్డును ఆక్రమించడంతో మరింత అధ్వానంగా మారింది. కనీసం పాదచారులు నడుస్తున్నారనే ఆలోచన కూడా లేకుండా నడిరోడ్డుపై టింకరింగ్, స్ప్రే పెయింటింగ్ వంటి పనులు చేయడంతో పెయింట్ పడి దుస్తులు ఖరాబవుతున్నాయని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనం నడపాలంటే నరకం చూడాల్సి వస్తోంది..

అసలే ఇరుకురోడ్డు. అందులో రోడ్డుకు ఇరువైపులా ఆటో మెకానిక్ దుకాణాలు, రోడ్డుమీదే టింకరింగ్, పెయింటింగ్, వెల్డింగ్ పనులు చేస్తుంటారు. దానికి తోడు రోడ్డును తవ్వి పూడ్చలేదు. ఈ పరిస్థితుల్లో నేరెళ్లకోనేరు కాలనీ, సీపీఐ కార్యాలయం రోడ్డులో ద్విచక్ర వాహనం నడపాలంటే నరకం చూడాల్సి వస్తుంది. పట్టించుకునేవారు లేరు.

– ఎస్.సంతోష్‌కుమార్, నేరెళ్లకోనేరు

దుస్తులు పాడవుతున్నాయి..

రైల్వే స్టేషన్‌కు, చావులమదుం వైపు మెయిన్‌రోడ్డుకు నీట్‌గా తయారై వెళ్తుంటే స్ప్రే పెయింటింగ్ ఎగిరి దుస్తులపై పడుతుంది. దీంతో అర్జెంట్ పనులపై వెళ్లే వారి దుస్తులు పాడవుతున్నాయి. అడిగితే మీ పని మీరు చూసుకోండి అని సమాధానం ఇస్తున్నారు. ఏం చేయాలో తెలియటం లేదు. పట్టించుకునేవారు లేరు.

– ఎం.నారాయణరావు, అల్లిపురం

దెబ్బలు తగిలించుకుంటున్నారు

వినాయక గుడి నుంచి హరిత లాడ్జి వరకు ప్రయాణించాలంటే ధైర్యం చేయాలి. తెగించి వాహనం వేసుకుని ఆ రోడ్డులో వెళ్తే ఇబ్బందులు తప్పవు. ప్రతి రోజు ఒకరిద్దరు పడుతున్నారు. దెబ్బలు తగిలించుకుంటున్నారు. మహిళల పరిస్థితి చెప్పనవసరం లేదు. తక్షణమే రోడ్డు పనులు చేపట్టాలి.

– పి.అచ్చియ్యమ్మ, నేరెళ్లకోనేరు కాలనీ



రోడ్డు మధ్యలో తవ్వి వదిలేసిన గొయ్యి.. ఉన్న కాస్త రోడ్డులో ఆటోల ఆక్రమణతో ఇరుగ్గా మారిన రోడ్డు



ఇరుకు రోడ్డు, ఆపై దాన్ని తవ్వేయడంతో వాహనం నడిపేందుకు ఇబ్బంది పడుతున్న దివ్యాంగ వ్యక్తి

క్లుప్తంగా

రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ నూతన కార్యవర్గం



నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రోటరీ గవర్నర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

డాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరూ సేవే లక్ష్యంగా పని చేయాలని రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. రోటరీక్లబ్ వైజాగ్ డైమండ్స్ 2025–26 ఏడాదికి నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్.కామేశ్వరరావు, కార్యదర్శిగా కె.మారుతి, కోశాధికారిగా ఏఎస్ గోపాల్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి వీరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు చక్కటి సేవా కార్యక్రమాలు నిర్వహించి సేవే లక్ష్యంగా సంస్థ ఉన్నతికి కృషి చేయాలన్నారు. పి.శోభన్‌ప్రకాష్, అసిస్టెంట్ గవర్నర్ ఎన్.గాయత్రి నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఎన్నికైన కామేశ్వరరావు బృందం ముందుగా తమ ఆమోదాన్ని తెలిపి, రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ ద్వారా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆర్.నీరజ, కామేశ్వరరావు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



మంచి మార్గంలో నడవాలని రౌడీషీటర్లకు హితవు పలుకుతున్న సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ జీడీ బాబు రౌడీషీటర్లతో నేరుగా మాట్లాడి వారి నడవడికపై కఠినంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసో.. తెలియకో చేసిన తప్పులు మీ జీవితాలను నాశనం చేయకూడదన్నారు. ఇకపై మంచి ప్రవర్తనతో జీవించాలని, మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, సమాజంలో మంచి పౌరులుగా మారాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇకపై చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లచే ప్రమాణ స్వీకారం చేయించి, ఎవరైనా గొడవలు, కొట్లాటలకు పాల్పడితే తాట తీస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారికి ఆదివారం ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు సేవలందించారు.

ప్రతి ఒక్కరికీ తల్లే తొలి గురువు



తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

అల్లిపురం: ఈ ప్రపంచంలో ప్రతి వారికీ తల్లే తొలిగురువు. తల్లిని గౌరవించుకుంటే అందరినీ గౌరవించినట్లే భావించాలని శ్రీ గౌరీ వివేక్ ట్యూషన్ సెంటర్ నిర్వాహకుడు రాపేటి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సాయంత్రం వెంకటేశ్వరమెట్టపై గల ట్యూషన్ సెంటర్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో తల్లికి పాద పూజ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కక్షతోనే బీసీలపై కూటమి ప్రభుత్వం దాడులు

- వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్



మాట్లాడుతున్న సనపల రవీంద్ర భరత్

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో నానాటికీ బడుగు, బలహీన వర్గాలపై కూటమి ప్రభుత్వం దాడులు చేస్తోందని, ఇదే కొనసాగితే రాబోయే రోజుల్లో బీసీలందరూ ఐక్యంగా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ హెచ్చరించారు. నియోజకవర్గంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో బీసీ నేత, ఉప సర్పంచ్ సత్తారు గోపిని హత్య చేశారని, నిన్న బీసీ మహిళ, కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడికి కూటమి నేతలు పాల్పడ్డారన్నారు. బీసీలను కూటమి ప్రభుత్వం ఏ రకంగా చూస్తుందో ఈ దాడులు.. హత్యలే నిదర్శనమన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎందుకు గెలిపించామా? అని ఇప్పటికే బాధపడుతున్న నేపథ్యంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. బీసీలు ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు సమీపంలోనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బీసీలపై దాడులు.. హత్యలు చేయడం మానుకోవాలని కోరారు.

చిన్నపాటి వర్షానికే ముంపునకు గురైన జ్ఞానాపురం

- పలు వీధుల్లో తాండవిస్తోన్న మురుగు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటున్న కార్పొరేటర్ పూర్ణిమ



మురుగుతో నిండిపోయిన సెబాస్టియన్ కాలనీలోని వీధులు



రాసవీధిలో కూడలిలో చేరిన మురుగునీరు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్రిగెడ్డ సమీపంలో పలు కాలనీలు ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మురుగు నీటితో జలమయమయ్యాయి. ఎర్రిగెడ్డలో పూడికలు తీయకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలనీలు నీట మునిగాయి. జ్ఞానాపురంలో గెడ్డవీధి, రాసవీధి, స్లీవ్‌గుర్తువీధి, సెబాస్టియన్ కాలనీ, బాబూ కాలనీ తదితర కాలనీల వీధులు రెండు అడుగుల లోతు మురుగు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సెలవు దినం కావడంతో పారిశుధ్య సిబ్బంది జాడ కనిపించలేదు. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో పూడికల తొలగింపు, తదితర పనులకు నిధులు మంజూరులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో కార్పొరేటర్ ఎర్రిగెడ్డ పూడికలు తీసే టెండర్ పిలవాలని మేయర్‌ను కోరారు. రానున్నది వర్షాకాలం కావడంతో తక్షణమే పూడికలు తీయించాలని కోరినా పట్టించుకోకపోవడంతో నేడు జ్ఞానాపురానికి ముంపు వాటిల్లినట్లు పలువురు స్థానికులు వాపోయారు.

కూటమి నాయకుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి..



జూన్‌లో జరిగిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో ఎర్రిగెడ్డ పూడికలు తీసే టెండర్ ఆమోదించి పనులు చేపడతామని మేయర్ పీలా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సర్వసభ్య సమావేశం జరిగి నెలరోజులు గడిచినా పూడికలు చేపట్టకపోవడంతో నేడు జ్ఞానాపురంలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దీనిపై కౌన్సిల్ సమావేశంలో నిరసన చేపట్టి వార్డు ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తాను.

– కోడిగుడ్ల పూర్ణిమ, 41వ వార్డు కార్పొరేటర్, జోన్–5

ఆకట్టుకున్న కోలాటం



శిల్పారామంలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కోలాట నృత్యం ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. అన్నమయ్య కీర్తనలు, వివిధ కూచిపూడి నృత్యాంశాలకు కోలాటం ప్రధానంగా నర్తించి కళాకారులు ఆకట్టుకున్నారు. బుజ్జి బుజ్జి గణపయ్య గీతానికి ప్రదర్శించిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా.. భావములోనా.. జతిస్వరం.., ముకుందా ముకుందా.. తదితర గీతాలతోపాటు కోలాటం బ్యాక్‌గ్రౌండ్‌గా అరకు థింసాను అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజీ, సంజన, మన్విత, నవ్య తదితర కళాకారులు పాల్గొనగా.. మోహనలక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక ఏవో రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

పోయిన బ్యాగ్ దొరికింది



పోగొట్టుకున్న బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందజేస్తున్న మేనేజర్లు జీవీ రమేష్, ఎంవీ రావు

డాబాగార్డెన్స్: విజయనగరం జిల్లాకు చెందిన ఎస్‌కే స్వామినాయుడు ఆదివారం మధురవాడ వచ్చేందుకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మధురవాడ పాయింట్‌కు వచ్చే సరికి బస్సులో బ్యాగ్ మరిచిపోయి దిగిపోయాడు. తర్వాత చూసుకుని కండక్టర్‌ను ఆశ్రయించాడు. మీ బ్యాగ్ ద్వారకాబస్ స్టేషన్ మేనేజర్‌కు అప్పజెప్పాను. పూర్తి వివరాలతో మీరు స్టేషన్ మేనేజర్‌ను కలవమని కండక్టర్ చెప్పాడు. స్వామినాయుడు ద్వారకాబస్ స్టేషన్‌కు వచ్చి స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్‌ను కలిసి బస్సులో బ్యాగ్ మరిచిపోయిన వివరాలు తెలపడంతో స్టేషన్ మేనేజర్ ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎంవీ రావు, సెక్యూరిటీ ఆర్‌జీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



గుట్కా, పాన్‌పరాగ్ వంటి మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకుంటున్న వన్‌టౌన్ పోలీసులు

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం సేఫ్ క్యాంపస్ జోన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లో పాన్‌షాపులు, ఇతర దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాలు, సిగరెట్లు, గంజాయి, మద్యం, పాన్ పరాగ్, గుట్కా తదితరాలు విక్రయించకూడదని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు హెచ్చరించారు. కళాశాలలు, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాక నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ డ్రైవ్ ఈగల్ విభాగం సమన్వయంతో నగర పరిధిలో విస్తృతంగా కొనసాగిస్తామన్నారు. ప్రజలు భాగస్వాములై పోలీసులకు సహకరించాలని, ఇలాంటి అక్రమాలు మీ పరిసర ప్రాంతాల్లో జరిగితే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. దాడుల్లో ఈగల్ సిబ్బంది వరప్రసాద్, వన్‌టౌన్ ఎస్ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక ఎఫ్ఆర్‌యూ సిబ్బందికి ఇబ్బందులు

ఆరిలోవ : ఆరిలోవలోని జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్ఆర్‌యూ) ఆస్పత్రిలో వేతనాలు అందక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. దీని నిర్వహణ బాధ్యతను కొన్నేళ్లుగా రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతోంది. ఆ సంస్థ తరచూ ఇక్కడి సిబ్బందికి వేతనాలు బకాయి పెట్టడం అలవాటుగా చేసుకుంది. వేతనాల గురించి సిబ్బంది అడిగినా ఫలితం ఉండదు. వారికి నచ్చినప్పుడే చెల్లిస్తుంటారు. ప్రస్తుతం మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 18 మంది సిబ్బంది ఉన్నారు. వారికి ఇంత వరకు మూడు నెలల వేతనాలు బకాయిపెట్టింది. ఇక్కడ పనిచేసే వారికి ఒక్క నెల వేతనం ఆగినా కుటుంబంపై భారం పడుతుంది. పిల్లల ఫీజులు, ఇంటి అద్దె కట్టడానికి నానా పాట్లు పడాల్సి వస్తోందని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక



శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్సను కలిసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ నాయకుడు, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ఆదివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పార్టీ అంతర్గత అంశాలపై చర్చించుకున్నారు. నియోజకవర్గంలో ప్రజల్లోకి తీసుకెళ్తున్న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం పట్ల వాసుపల్లిని బొత్స అభినందించారు. మరింతగా ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, అరాచక పాలన పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం తమ బాధ్యత అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న చంద్రబాబు, లోకేష్ ఏడాది పాలనను ఇప్పటికే ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. జననేత జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను ప్రజలు కోరుకుంటున్నారని వాసుపల్లి తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



రాచపోలమాంబ పండగ సందర్భంగా విద్యుత్ దీపాలంకరణలో అల్లిపురం మెయిన్‌రోడ్డు



తిరువీధి ఉత్సవంలో సాము గరిడీ కళాకారుల సందడి

అల్లిపురం: స్థానికుల ఆరాధ్య దైవం శ్రీ రాచపోలమాంబ అమ్మవారి పండగలో భాగంగా ఆదివారం మరిడిమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టింటి నుంచి అమ్మవారిని తీసుకుని తప్పెటగుళ్ల, సాము గరిడీలతో కుమ్మరివీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు మీదుగా తిరిగి అమ్మవారి సతకం పట్టుకు అమ్మవారి తిరువీధి చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలనాగమ్మ బుర్రకథ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కాగా రాచపోలమాంబ ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ జరుగుతుందన్నారు.

వాహన చోదకులకు అవగాహన



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీలక్ష్మి

అల్లిపురం: హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలపై వాహన చోదకులకు ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్, అంబేడ్కర్ సర్కిల్ వద్ద టూటౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీలక్ష్మి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై న్యూ సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం నిబంధనలు కఠినంగా ఉంటాయని ఆమె తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా రూ.1000 నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు వెనకాడేది లేదని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే గతంలో రూ.500 జరిమానా ఉండేదిదని, ఇప్పుడు దానిని రూ.5 వేలకు పెంచినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే గతం లో రూ.2 వేలు ఉండగా.. ఇప్పుడు రూ.10 వేలు, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు వేసుకోకుండా కార్లు నడిపితే రూ.వెయ్యి జరిమానా, మూడు నెలలు లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com